ఉక్రేనియన్ జానపద గాథలు - 2

# గొర్రెల కాపరి



ఉక్రేనియన్ జానపద గాథలు - 2

# గొర్రెల కాపరి

అనువాదం : ఆర్వీయార్

మంచి పుస్తకం

Ukrainian Folk Tales

**ఉక్రేనియన్ జానపద గాథలు - 2**

**గొర్రెల కాపరి**


| | | |
|---|---|---|
| అనువాదం | : | ఆర్వీయార్ |
| బొమ్మలు | : | వి. గొర్‌దియ్‌చుక్ |

"రాదుగ" ప్రచురణాలయం ద్వారా 1988లో సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

| | | |
|---|---|---|
| ప్రచురణ | : | ఆగస్టు, 2011 |
| ప్రతుల సంఖ్య | : | 3000 |
| వెల | : | రూ. 22/- |
| ISBN | : | 978-93-80153-57-5 |

ప్రచురణ, ప్రతులకు :

**మంచి పుస్తకం**

12-13-439, వీధి నెం. 1

తార్నాక, సికింద్రాబాదు - 500 017

ఫోన్ : 94907 46614.

email : info @ manchipustakam.in

website : www.manchipustakam.in

ముద్రణ :

చరిత ఇంప్రెషన్స్

1-9-1126/బి, అజామాబాద్

హైదరాబాదు - 500 020

ఫోన్ : 040 - 2767 8411

# కథా క్రమం


| | | | |
|---|---|---|---|
| 1. | మహాకాళాన్ని మట్టుబెట్టిన ఇవాన్ | . . . . . | 05 |
| 2. | చర్మకారుడు కిరీల్ | . . . . . | 10 |
| 3. | రైతు కొడుకు ఇవాన్ | . . . . . | 14 |
| 4. | గొర్రెల కాపరి | . . . . . | 29 |

అద్భుత లోకం గురించీ, ఆ లోకంలోని వీరుల గురించీ చెప్పే కమనీయ జానపద గాథలు ఒక తరాన్నించీ ఇంకో తరానికి ఏనాటినుంచో అందుతూనే ఉన్నాయి. లోకుల యుక్తి, చమత్కారం, హాస్యం తొణికిసలాడే గాథలు ఇవి. చాలా కాలం అవి మౌఖికంగానే ఉండిపోయాయి. శ్రోతలకి వాటిని వినిపించేవారు. అందుకనే వాటికి గాథలని పేరు వచ్చింది.

ఉక్రేనియన్ జానపద గాథలు అపారంగా ఉన్నాయి. పాతకాలం నాటి వీరుల్నీ, సంఘటనల్నీ ఈ గాథల్లో అడుగు అడుగునా మనం చూస్తాం. సామాన్య ప్రజలలో ధైర్యం ఉన్న మనుషులూ, ఉల్లాసం కలిగించే సాహసకృత్యాలు, చలాకీగా ఉండే జంతువులూ, పక్షులు పాఠకులకి సంతోషం కలిగిస్తాయి.

ప్రకృతి గురించీ, పెంపుడు జంతువుల గురించీ, అడవి జంతువుల గురించీ, పక్షుల గురించీ ప్రాథమిక జ్ఞానాన్ని జానపద గాథలు పిల్లలకి అందిస్తాయి.



# మహాకాళాన్ని మట్టుపెట్టిన ఇవాన్

అనగా అనగా ఒకప్పుడు ఒక భయంకరమైన మహాకాళం ఉండేది. అది ఒక ఊరిమీద పడి ఊళ్లో వాళ్లని తినేస్తూ ఉండేది. ఆఖరికి ఆ ఊళ్లో ఒక్క ముసలాయన మాత్రం మిగిలాడు. అప్పుడు ఆ మహాకాళం ఇలా అనుకుంది:

"ఇతన్ని రేపు పొద్దుటి దాకా ఉంచేస్తాను. అప్పుడు ఫలహారంగా తినొచ్చు."

సరిగ్గా ఆ రోజునే ఒక యువకుడు ఆ ఊరిగుండా వెళుతున్నాడు. అతను ముసలతని ఇంటికి వెళ్లి తలుపుకొట్టి ఆ రాత్రికి తల దాచుకోనిమ్మని అడిగాడు.

"నీకు బతుకు మీద విరక్తి పుట్టిందా, ఏం?" అని ముసలాయన ఆ యువకుడిని అడిగాడు.

"ఏం అలా అడుగుతున్నావ్?" అన్నాడు ఆ యువకుడు.

అప్పుడు ఊళ్లో వాళ్లందరినీ తినేసిన ఆ మహాకాళం గురించి ఆ ముసలాయన చెప్పాడు. రేపు తెల్లవారుతూనే తనని తినెయ్యడానికి అది వస్తుందనీ చెప్పాడు.

"నిన్ను అది తినలేదు. ఉక్కిరిబిక్కిరి అయి చస్తుంది," అని యువకుడు ముసలాయనకి చెప్పాడు.

ఆ మర్నాడు పొద్దుటే మహాకాళం ఎగురుకుంటూ ఊరికి వచ్చింది.

"భేష్! నిన్న చూస్తే ఒక్కడే ఉన్నాడు. ఇవాళ ఇద్దరయ్యారు."

"జాగ్రత్త! మమ్మల్ని మింగే లోపున నువ్వు ఉక్కిరిబిక్కిరి అయి చస్తావ్," అన్నాడు యువకుడు.

ఆ మహాకాళం అతనికేసి ఆశ్చర్యంగా చూసింది.

"అయితే నాకంటే నీకు బలం ఎక్కువ ఉందనుకుంటున్నావా?"

"అనుకోవడం ఏమిటి! ఉందని నాకు తెలుసు," అన్నాడు.

"నువ్వు బలవంతుడవని నేను నమ్మను. చూడు ఏం చేస్తానో," అంది మహాకాళం. ఒక రాయిని తీసుకుని గట్టిగా నొక్కేసింది. అది పొడుం పొడుం అయిపోయింది.



"ఓస్, ఇంతేనా! దాంట్లోనుంచి నీళ్లు కారేటట్టు పిండు," అన్నాడు యువకుడు.

తను మాత్రం అప్పుడే ఇంట్లో చేసిన జున్ను ముక్కని తీశాడు. ఆరడం కోసమని ఆ జున్ను ముక్కకి ఒక పొడి గుడ్డని చుట్టబెట్టారు. చూడ్డానికి అది అచ్చం రాయిలాగానే ఉంది. యువకుడు దాన్ని నొక్కగానే నీళ్లు కారాయి.

"ఇదుగో, ఇలా చెయ్యాలి మరి," అన్నాడు.

"ఊఁ, నువ్వు బలవంతుడివే! నాకర్థం అయింది. రా, మనం స్నేహంగా ఉందాం," అంది మహాకాళం.

"అలాగే, కాని నేను చెప్పినట్టు నువ్వు వింటేనే," అన్నాడు.

మహాకాళం ఆ యువకుడిని తన ఇంటికి తీసుకువెళ్లింది. యువకుడి పేరేమిటని అడిగింది.

"మహాకాళాన్ని మట్టుపెట్టిన ఇవాన్ అంటారు," అని అతను జవాబు చెప్పాడు.

ఆ మాట వినగానే మహాకాళానికి మతిపోయింది. 'అమ్మో! వీడు నన్ను చంపేస్తే!' అనుకొంది.

భోజనాల వేళ అయింది.

"వెళ్ళి ఒక ఎద్దుని తీసుకురా, వంట చేసుకుందాం ఇవాన్," అంది.

మహాకాళం ఎడ్ల మందలు మేస్తూ ఉన్న చోటికి ఇవాన్ వెళ్లాడు. ఎద్దుని తీసుకెళ్లడం మాట సరేసరి, కనీసం ఎద్దు కాలిని కూడా కదపలేదు తను. వెళ్లి ఒక ఎద్దు తోకని ఇంకో ఎద్దు తోకకి ముడివెయ్యడం మొదలుపెట్టాడు. అతను ఇంకా వస్తాడు ఇంకా వస్తాడు అని చెప్పి మహాకాళం కనిపెట్టుకు కూర్చుంది. అప్పుడు ఏమిటింత ఆలస్యం అయింది చెప్మా, వెళ్లి చూద్దాం అనుకుని తనే పరిగెత్తుకుంటూ వచ్చింది.

"ఏం చేస్తున్నావ్, ఇవాన్?" అని అడిగింది.

"ఒకటీ అరా ఎద్దులతో ఏం సర్దుకు తంటాలు పడతాం, అన్నిటినీ ఒకే దఫా ఇంటికి తెచ్చేస్తే శ్రమ తప్పుతుంది కదా అనుకున్నా," అన్నాడు ఇవాన్.

"ఓరి నీ ఇల్లు కూల! ఇలా అయితే నాకు మంద మిగిలినట్టే," అని మహాకాళం అరిచింది. మహాకాళం ఒక ఎద్దుని చంపి చర్మం ఒలిచి, కళేబరాన్నీ, చర్మాన్నీ ఇంటికి ఈడ్చుకుపోయింది.

"ఇదిగో ఈ చర్మం తీసుకెళ్లి దీంటో కాసిని నీళ్లు పట్టుకు రా," అని చర్మాన్ని ఇవాన్‌కి ఇచ్చింది.

ఇవాన్ దాన్ని తీసుకున్నాడు. దాన్ని ఈడ్చుకు పోవడంతోనే సరిపోయింది అతనికి. దాన్ని బావిలో పడేశాడు. కాని ఇవతలికి లాగలేకపోయాడు. అందుకని ఒక పార తీసుకున్నాడు. బావి చుట్టూ పారతో తవ్వడం మొదలుపెట్టాడు.

'ఏమయిందబ్బా ఇంకా రాలేదు,' అనుకుని మహాకాళం అక్కడికి వచ్చింది.

"ఏం చేస్తున్నావయ్యా, ఇవాన్," అని అడిగింది.

"వెధవ ఎద్దు చర్మంతో నీళ్ళు తెచ్చే బెడద పెట్టుకోదల్చుకోలేదు. ఏకంగా బావినే ఇంటికి తెచ్చేస్తే శ్రమ తప్పుతుందనిపించింది," అన్నాడు.

"ఓరి నీ అసాధ్యం కూల!" అని మహాకాళం అరిచింది.

ఇవాన్ గొప్ప బలవంతుడని అది భయపడి పోయింది. బావిలో ఉన్న చర్మాన్ని తనే ఇవతలికి లాగి, నీళ్లు పట్టుకెళ్లింది.

"వెళ్లి కాసిని కట్టెలు పట్రా. ఎండిపోయిన ఓక్ చెట్టు ఒకదాన్ని పీక్కురా చాలు," అంది మహాకాళం.

ఇవాన్ కోపం వొచ్చినట్టు నటించాడు.

"నేనా? చాలు చాలు! వెధవ పుచ్చు ఓక్ చెట్టు కోసం తంటాలు పడమంటావ్ నన్ను? కనీసం ఒక ఇరవై చెట్లని తెమ్మని చెప్పాల్సింది నువ్వు," అన్నాడు.

దాంతో, ఆ మహాకాళం వంట చేసుకుని మెక్కడం మొదలుపెట్టింది. తను ఎలాగూ ఎక్కువ తినలేడు, కొంచెంగా కతికితే తనకి బలమూ బగ్గీ లేదని మహాకాళం కనిపెట్టేస్తుంది అనుకొని ఇవాన్ దానితోపాటు భోజనానికి కూర్చోలేదు. మహాకాళం దాదాపు మొత్తం మాంసం తినేసి, కుండలో అడుగూ బొడుగూ మిగిల్చింది. ఇవాన్ అప్పుడు భోజనానికి కూర్చున్నాడు. ఆ ఉన్నది కాస్తా వడ్డించుకున్నాడు.

"ఇదే మూలకి? చాలదు," అన్నాడు.

"మా అమ్మ దగ్గరికి వెడదాం పద, ఆవిడ పాల కుడుములు చేసి పెడుతుంది," అని మహాకాళం అంది.

"పద," అన్నాడు ఇవాన్. 'ఈ దెబ్బతో మన పని గోవిందా,' అనుకున్నాడు మనసులో.

మహాకాళం అతన్ని తన అమ్మగారింటికి తీసుకు వెళ్లింది. అక్కడ తినడానికి ఇరవై పీపాల కుడుములు ఉన్నాయి!

ఆ మహాకాళమూ, ఇవాన్ భోజనానికి కూర్చున్నారు. మహాకాళం కుడుము తర్వాత కుడుము తినేస్తూనే ఉంది. కాని ఇవాన్ తింటున్నట్టు నటిస్తూ పై జేబుల్లోనూ, కింద జేబుల్లోనూ కుడుముల్ని కుక్కుకుంటూ కూర్చున్నాడు. ఇరవై పీపాలు ఖాళీ అయిపోయాయి. మహాకాళం లేచి నుంచుంది.

"పట్టు, ఒక రాతిని మెలితిప్పుదాం. మనలో ఎవరు బలవంతులో తేలుతుంది," అంది.

"ఊ, కానీ," అన్నాడు ఇవాన్.

పొలంలో ఒక పెద్ద రాయి కనిపించింది. మహాకాళం చాలా గట్టిగా దాన్ని నొక్కింది. నిప్పురవ్వలు దాంట్లోనుంచి లేచాయి.

"ఓస్, ఇదేనా! నీళ్ళు కారేటట్టు దాన్ని నొక్కాలి," అన్నాడు ఇవాన్.

అతను రాయిని పట్టుకుని తన మీదకి అదుముకున్నాడు. జేబుల్లో కుక్కుకున్న కుడుములు అణిగి నీళ్లు జలజలా కారాయి.

“చూశావా? ఇలా చెయ్యాలి!” అన్నాడు.

మహాకాళం భయంతో వణికి పోయింది.

“రా, ఇవాన్, మనలో ఎవరు గట్టిగా ఈల వేస్తారో చూద్దాం,” అంది. అది గట్టిగా ఈల వేసేటప్పటికి చెట్లు నేలమీదకి వాలిపోయాయి.

‘ఇప్పుడు నేనేం చెయ్యాలిరా దేవుడా,’ అని మనసులో అనుకున్నాడు ఇవాన్. చుట్టూతా చూశాడు. అప్పుడు అతనికి నేలమీద ఒక ఇనప ముక్క కనిపించింది.

“గట్టిగా కళ్లు మూసుకో మహాకాళం. నేను గట్టిగా ఈల వేస్తే నీ గుడ్లు పేలిపోతాయి,” అన్నాడు.

మహాకాళం కళ్లు మూసుకుంది. ఇవాన్ ఇనప ముక్కని తీసి మహాకాళాన్ని గట్టిగా కొట్టాడు. ఆ దెబ్బకి అది అబ్బా అని బాధతో మూలిగింది.

“నిజమేనయ్యోయ్! నిజంగానే నా గుడ్లు పేలినంత పనైంది,” అంది.

ఇవాన్‌ని చూస్తే దానికి ఎంత భయం కలిగిందంటే అతనితో కలిసి అదే ఇంట్లో ఉండాలంటే ఠారెత్తిపోయింది. దాంతో ఊరి చివర తనకి వేరే ఇల్లు కట్టుకుంది. తర్వాత అదీ, తల్లీ కలిసి ఇవాన్‌ని ఎలా హతం చెయ్యాలా అని ఆలోచన చేశాయి.

“వాడు ఇంట్లో ఉండగానే ఇంటికి నిప్పెట్టేద్దాం,” అన్నాయి అవి.

కాని ఇవాన్ వాటి మాటలు విని ఇంట్లో ఉండకుండా బయటికి వెళ్లిపోయాడు.

అవి ఇవాన్ ఇంటిని తగలబెట్టేశాయి. కాని అతను ఇల్లు ఉండే చోటే ప్రత్యక్షమై ఏమీ ఎరగనట్టు బట్టలమీద ఉన్న బూడిద దులుపుకోవడం మొదలుపెట్టాడు.

మహాకాళం వాడిని చూసింది. దానికి మతిపోయింది.

“ఏమిటి! నువ్వింకా బతికే ఉన్నావా, ఇవాన్,” అంది.

“ఏం? నాకేమైంది! రాత్రి ఎందుకనో బాగా అనిపించలేదు. దోమ ఏదో కుట్టినట్టుంది,” అన్నాడు.

‘ఇక ఇవాన్‌కి దూరంగా ఉండడం మెరుగు. నిప్పూ, మంటలూ కూడా వీడికి లెక్కాజమా లేకుండా ఉన్నాయి,’ అనుకుంది మహాకాళం. అది ఎక్కడికో వెళ్లిపోయింది. మళ్లీ ఈ ఛాయలకి రాలేదు.



# చర్మకారుడు కిరీల్

అనగనగా ఒక నగరాన్ని ఒక రాజు పరిపాలిస్తూ ఉండేవాడు. ఆ రోజుల్లో నగర ప్రాకారం బయట ఒక మహాకాళం ఉండేది. అది నగర వాసుల నుంచి కప్పం గుంజుతూ ఉండేది. వాళ్లు దానికి సంవత్సరానికి ఒక మగవాడినో, ఒక కన్యనో అర్పించాల్సి వచ్చేది.

మహాకాళం దగ్గరికి రాజు కూతురిని పంపే వంతు వచ్చింది. అతను నగర వాసులందరి లాగానే తన కూతుర్ని పంపాడు.

ఆ రాకుమారి అద్వితీయ సౌందర్యవతి. ఆ మహాకాళం ఆమెని చూడగానే ప్రేమించింది. ఆ విషయం తెలిసి ఆ రాకుమారి మహాకాళం పట్ల జాలి చూపించి తియ్యగా మాట్లాడ్డం మొదలుపెట్టింది.

కొన్ని రోజుల తరవాత "నిన్ను జయించగలవాడు ఎవడైనా ఈ భూమ్మీద ఉన్నాడా?" అని మహాకాళాన్ని అడిగింది.

"నగరంలోని నదిఒడ్డున ఒక చర్మకారుడు ఉన్నాడు. అతను చాలా బలిష్ఠుడు. పట్టుకి పన్నెండు చర్మాలకు తక్కువ కాకుండా నదిలో నాన వేస్తాడు. అవి నీళ్ళల్లో పడితే నాని బరువెక్కి పోతాయి. నీటి అడుగున వాటిని పట్టి ఉంచుదామని నేను ఒకసారి ప్రయత్నించాను. అసలతను వాటిని బయటికి లాగగలడో లేదో చూద్దామని అలా చేశాను. సునాయాసంగా లాగేశాడు. నేను కనక బెసికితే నన్నూ లాగి ఉండేవాడు. అతని ఒక్కడికే నేను భయపడేది," అంది మహాకాళం.

రాకుమారి ఆ విషయం గ్రహించింది. తండ్రికి తన గురించిన వర్తమానం అందచేసి ఇంటికి వెళ్లేందుకు మార్గం ఆలోచించసాగింది. ఆమెకి తోడు ఎవరూ లేరు. తను నగరంలో ఉన్నప్పుడు పెంచుకున్న పావురం మాత్రం ఆమెతో ఉంది. చాలా చాలా ఆలోచించాక ఆమె తండ్రికి ఉత్తరం రాయాలని అనుకుంది.



"నగరంలో కిరీల్ అనే చర్మకారుడు ఉన్నాడు. అతను మహాకాళంతో పోరాడి, నన్ను విడిపించగలడు. దురదృష్టవంతురాలినైన నన్ను బందిఖానా నుంచి తప్పించగలడు. నువ్వు ఎలా అయినా అతన్ని ఒప్పించేట్టు చెయ్యి. అతను గనక మాటలకి లొంగకపోతే కానుకలు గుప్పించు. అతనితో ఎవరినీ అమర్యాదగా ప్రవర్తించనియ్యొద్దు. చిన్న పరుష వాక్యానికి కూడా అతనికి కోపం కలగొచ్చు. నేను మీ ఇద్దరి కోసం ప్రార్థిస్తా, మిమ్మల్ని కాపాడమని భగవంతుడిని వేడుకుంటా..." అని రాసింది.

ఆ ఉత్తరాన్ని పావురం రెక్కకి కట్టింది. దాన్ని కిటికీలోంచి బయటికి వదిలింది. పావురం ఆకాశంలో ఎత్తుగా ఎగురుతూ రాజభవనానికి వెళ్లింది. తోటలో ఆడుకుంటూ ఉన్న రాజు పిల్లలు దాన్ని చూశారు.

"నాన్నా, నాన్నా! అక్కయ్య పెంపుడు పావురం వచ్చింది," అని అరిచారు.

రాజు హృదయం ఆనందంతో ఉప్పొంగి పోయింది. కానీ వెంటనే ఏదో ఆలోచన తట్టి భారమైపోయింది.

"నా బిడ్డ చచ్చిపోయి ఉంటుంది, మహాకాళం చంపేసి ఉంటుంది," అనుకున్నాడు. తన చేతిమీదకి రమ్మని పావురాయిని బతిమిలాడాడు. అది రాగానే చూస్తే దాని రెక్కకి ఒక ఉత్తరం కట్టి ఉంది. అది చదివి అతను తన ముఖ్యుల్ని పిలిచాడు.

"నగరంలో కిరీల్ అనే చర్మకారుడు ఉన్నాడా?" అని అడిగాడు.

"ఉన్నాడు, రాజా! అతను నది ఒడ్డున ఉంటాడు," అని వాళ్లు జవాబు చెప్పారు.

"అతని దగ్గరికి వెళ్లి, అతనికి కష్టం కలిగించకుండా, మనం కోరినట్టు చేసేలా అతన్ని ఒప్పించడం ఎలా?" అని అడిగాడు.

వాళ్లు ఆ విషయం గురించి ఆలోచించారు. నగరంలో అందరికంటే వృద్ధులైన వాళ్లని అతని దగ్గరికి పంపాలని నిర్ణయించుకున్నారు.

తక్షణం దూతలు బయలుదేరారు. వాళ్లు కిరీల్ గుడిసెకి వెళ్లి తలుపు తోసి ఎక్కడి వాళ్లు అక్కడే కొయ్యబారిపోయారు. ఆ చర్మకారుడు నేలమీద అటు వేపు తిరిగి కూర్చున్నాడు. పన్నెండు ముతక తోళ్లని ఒట్టి చేతులతో మెలితిప్పుతున్నాడు, నొక్కుతున్నాడు.

ఒక దూత దగ్గాడు. కిరీల్ ఆ చర్మాలని గట్టిగా మెలిపెట్టాడు. దాంతో అవి అతని చేతిలోనే చిరిగిపోయాయి. అతను ఇటు తిరిగి ఆ ముసలివాళ్లని చూశాడు. వాళ్లు ఒంగి వందనం చేసి తమని ఎవరు, ఎందుకు పంపారో చెప్పబోయారు. కాని అతనికి చాలా కోపం వచ్చి వాళ్లకేసి చూడనూ లేదు, వాళ్లు చెప్పేది వినసూ లేదు. వాళ్లు ఎంతో బతిమిలాడారు, ప్రాధేయపడ్డారు. ఆఖరికి అతని ముందు సాష్టాంగపడ్డారు. అయినా ఏమీ లాభం లేకపోయింది. ఇక ఏం చెయ్యాలి?

వాళ్లు చాలా దిగులుగా వెనక్కి తిరిగి వెళ్లారు. ఆ రాజు చాలాసేపు ఆలోచించాడు. నగరంలో ఉండే వాళ్లల్లో అతి తక్కువ వయసు వాళ్లని కిరీల్ దగ్గరికి పంపాలని నిర్ణయించుకున్నాడు.

కాని పెద్దవాళ్ల లాగానే ఈ కుర్రవాళ్లూ అయ్యారు. వాళ్లు ఎంతగా ప్రాధేయపడ్డా ఆ చర్మకారుడు ఉలక్కుండా పలక్కుండా విన్నాడు. బెల్లం కొట్టిన రాయిలా అలానే కూర్చుండిపోయాడు.

రాజు మళ్లీ చాలాసేపు ఆలోచించాడు. కొంత మంది పసివాళ్లని కిరీల్ దగ్గరికి పంపాడు. వాళ్లు అతని గుడిసె దగ్గరికి వెళ్లి సాష్టాంగ పడి, ప్రాధేయ పడి ఏడ్చారు. అది చూసి అతని కళ్లల్లోనూ నీళ్లు తిరిగాయి.

"సరే, మీ కోరిక ప్రకారమే చేస్తాను," అన్నాడు.

అతను రాజు దగ్గరికి వెళ్లి పన్నెండు సీసాల తారూ, పన్నెండు బళ్ల జనపనార కావాలని అడిగాడు. వాటిని తెప్పించారు. అతను పీచుని తన చుట్టూ పేనుకున్నాడు. దానిమీద తారు పూయించాడు. ఆరు మణుగుల బరువు ఉన్న గదని తీసుకుని మహాకాళం దగ్గరికి వెళ్లాడు.

"నాతో యుద్ధం చెయ్యడానికి వచ్చావా, శాంతి ఒప్పందం చేసుకుందామని వచ్చావా, కిరీల్?" అని మహాకాళం అడిగింది.

"యుద్ధం చెయ్యడానికి వచ్చాను, దుష్ట పిశాచమా! చచ్చినా నీతో శాంతి ఒప్పందం చేసుకోను," అన్నాడు. యుద్ధం మొదలైంది. భూమి కంపించింది, దద్దరిల్లింది.

మహాకాళం కిరీల్ మీదకి లంఘించి అతన్ని కరవాలని ప్రయత్నించేది. అలా చేసినప్పుడల్లా కాస్త తారు దాని కోరలకి తగులుకుని ఊడొచ్చేవి. మళ్లీ అతని మీదకి గెంతేది. అప్పుడు నోటినిండా పీచు తగిలేది. కాని కిరీల్ మాత్రం తన గదతో ఆ మహాకాళాన్ని కొట్టి నేలమీదకి పడేటట్టు చేసేవాడు.

మహాకాళం నిప్పుల్లో ఉన్నట్టుగా వేడెక్కిపోయింది. ఒక మూలుగు మూలిగి, చల్లని నీళ్లు తాగుదామని నది దగ్గరికి పరిగెత్తి పోయేది. అప్పుడు ఆ చర్మకారుడు మళ్లీ కొంచెం పీచు చుట్టుకుని కొంచెం తారు పూసుకునేవాడు.

మహాకాళం నీళ్ళల్లో నుంచి బయటికి వచ్చి కిరీల్ మీదకి ఉరికినప్పుడల్లా అతను గద ఎత్తి దాన్ని కొట్టేవాడు. ఎంత గట్టిగా కొట్టేవాడంటే నేల ప్రతిధ్వనించేది. సుళ్లుసుళ్లుగా పొగ మేఘాలు లేచి, నిప్పురవ్వలు ఎగిసి పడే దాకా యుద్ధం సాగింది.

కిరీల్ ఇంకా గట్టిగా, వేగంగా దెబ్బలు కొట్టాడు. కొలిమిలో ఉన్న ఆరుగొయ్యలాగా అయింది మహాకాళం. అది దగ్గింది, ఉమిసింది. దాని కింద నేల దద్దరిల్లింది.

నగరంలోని జనం కొండలపైన నుంచుని ఆ యుద్ధం చూశారు. వాళ్లు ఉన్న చోటనే బిగిసిపోయి చూశారు.

ఇంతలో ఉన్నట్టుండి మహా ఘోష వినిపించింది. మహాకాళం ఫెళఫెళారావంతో నేలపైన పడిపోయింది. ఆ పడిపోవడంతో భూమి కంపించింది, దద్దరిల్లింది. కొండ శిఖరాలపైన నుంచున్న జనం చప్పట్లు కొట్టి చర్మకారుడు కిరీల్‌ని మెచ్చుకున్నారు.

మహాకాళం చచ్చి పడింది. కిరీల్ అలా దాన్ని హతమార్చి రాకుమారిని కాపాడి ఆమె తండ్రికి అప్పగించాడు.

కిరీల్‌కి కృతజ్ఞతలు ఎలా చెప్పాలో రాజుకి తెలియలేదు. ఆ నాటినుంచీ కిరీల్ నివసించిన ప్రాంతానికి చర్మకారుని స్థావరం అని పేరు వచ్చింది.



# రైతు కొడుకు ఇవాన్

అనగా అనగా ఒకప్పుడు ఒక చక్రవర్తీ, ఆయన పట్టపురాణీ ఉండేవాళ్లు. వాళ్లకి చాలా కాలం సంతానం లేకపోయింది. వాళ్ల పడుచుతనం అలా గడిచినా, వయసుమళ్లే సమయంలో ఒక కొడుకు పుట్టాడు. వాళ్లకి చాలా ఆనందం కలిగింది. ఆ కొడుకు పెరిగి పెద్దవాడయాడు. వివాహం చేసే వయసు వచ్చిందని చక్రవర్తీ, మహారాణీ అనుకున్నారు.

"నిప్పు తిని జ్వాలలు తాగే గుర్రం కావాలి. ఆ గుర్రం పరిగెత్తేటప్పుడు భూమి అదరాలి, ఓక్ చెట్లు కంపించిపోయి ఆకులు రాల్చాలి. అలాంటి గుర్రాన్ని ఇస్తేనే గాని నేను పెళ్లి చేసుకోను," అన్నాడు రాజకుమారుడు.

చక్రవర్తి తన సైన్యంలో కాకలుతీరిన యోధుల్ని పిలిపించాడు. అలాంటి గుర్రం గురించి ఎవరన్నా ఎప్పుడన్నా విన్నారా, కన్నారా అని అడిగాడు. కాని ఎవరిని అడిగినా మేం వినలేదంటే మేం వినలేదు అన్నారు. అప్పుడు చక్రవర్తి తన రాజ్యం నలుమూలలా దండోరా వేయించాడు. అలాంటి గుర్రం గురించి విన్న వాడు, లేదా అలాంటి గుర్రాన్ని కనిపెట్టగలను అనుకున్న వాడు రాజభవనానికి రావలసిందిగా చాటింపు వేయించాడు.

ఆ వార్త మారుమూల గ్రామాలకి కూడా పాకింది. రైతులందరి చెవినా పడింది. ఒక రైతు ఈ వింత వార్తని పెళ్లాం చెవిన వేశాడు.

"చూడు! అలాంటి గుర్రాన్ని ఎక్కడ పట్టుకోవచ్చో చెప్పేవాడు రాజ భవనంలోకి వెళ్లి చక్రవర్తినే దర్శించవచ్చు," అని చెప్పాడు.

ఆ రైతుకి ఇవాన్ అనే ఒక కొడుకున్నాడు.

"అలాంటి గుర్రం ఎక్కడ ఉంటుందో నాకు తెలుసు," అని ఇవాన్ అన్నాడు.



“తెలివితక్కువగా మాట్లాడకు. ఆ మాట గట్టిగా అంటే గుమ్మం దాటగానే ఇరుగుపొరుగు పిల్లకాయలు నిన్ను చితగ్గొడతారని తెలిసీ అలాంటి మాటలు ఎందుకంటావ్?” అన్నాడు తండ్రి.

కాని ఇవాన్‌ని ఆపలేకపోయాడు.

“నాన్నా! నాతో తోటలోకి రా, నీకు ఒకటి చూపిస్తా,” అన్నాడు.

తండ్రీకొడుకులు పెరట్లోకి వెళ్లారు. కొడుకు ఒక చేత్తో ఓక్ చెట్టుని పట్టుకుని నేలమీదకి వంచాడు. భయంతో తండ్రికి మాట రాలేదు, మిడిగుడ్లు పడిపోయాయి.

“నీ మాట నమ్ముతున్నాన్రా నాయనా,” అన్నాడు.

తండ్రీకొడుకులు కలిసి గ్రామ పెద్ద ఇంటికి వెళ్లారు. తండ్రి ఇవాన్‌ని పెరట్లో ఉండమని చెప్పి, తను లోపలికి వెళ్లి గ్రామ పెద్దతోనూ, ఆయన సలహాదారులతోనూ మాట్లాడ్డానికి అనుమతి అడిగాడు.

“చక్రవర్తి గారు కావాలంటున్న గుర్రాన్ని మా అబ్బాయి తేగలడు,” అని చెప్పాడు.

దాంతో వాళ్లందరూ తండ్రి మీద రంకెలు వెయ్యడం మొదలుపెట్టారు. అలాంటి పుకార్లు వ్యాప్తి చేస్తున్నందుకు తండ్రీకొడుకులకి చెరసాల యోగం పడుతుందని అన్నారు.

“నీ కొడుకో చవట, బడాయికోరు. వాడి బలం ఎంతో ప్రతి వాళ్లకీ తెలుసు. వాడు గుమ్మం దాటి బయటికి వెళితే ఇరుగుపొరుగు పిల్లకాయలు వాడిని చితగ్గొడతారని తెలిసీ అలాంటి మాటలు ఎందుకంటావ్,” అన్నారు వాళ్లు.

తండ్రీకొడుకుల్ని చెరసాలలో పెట్టించారు. జిల్లా అధికారి ఈ విషయం గురించి బాగా ఆలోచించే దాకా వాళ్లు చెరసాలలోనే ఉన్నారు.

“ఒకవేళ, వాళ్లు అబద్ధాలాడుతోంటే ఆడనీ! అందుకు ఫలితం వాళ్లే అనుభవిస్తారు. మనం కాదుగా?” అన్నాడాయన.

అప్పుడు తండ్రీకొడుకుల్ని విడుదల చేశారు. డాబులు కొడుతున్న కొడుకు గురించి చక్రవర్తికి తెలియచేశారు. చక్రవర్తి ఆ వార్త అందుకున్నాడు. ఒక సాధారణ రైతు కొడుకు తనకంటే గొప్ప వాళ్లు చెయ్యలేని పనిని చెయ్యగలడని ఆయన నమ్మలేదు. అయినా పోయిందేముంది అనుకుని అతనికి కబురు చేశాడు.

చక్రవర్తి నౌకర్లు ఇవాన్‌ని రాజ భవనానికి తీసుకెళ్లి వెంటనే చక్రవర్తి సముఖాన ప్రవేశపెట్టారు.

“నిజంగా నేనడిగిన గుర్రాన్ని నువ్వు తేగలవా?” అని చక్రవర్తి అడిగాడు.

“చిత్తం, ప్రభూ,” అన్నాడు వాడు.

“నీ పని తేలిక కావడానికి ఏమన్నా కావాలా?”

“ఒక మంచి గుర్రాన్నీ, గదనీ ఇప్పించండి.”

చక్రవర్తి గుర్రాల సంరక్షకుడికి ఒక బరాతం (లిఖితపూర్వక ఆజ్ఞ) రాసి ఇచ్చాడు.

"దీన్ని తీసికెళ్లి మా గుర్రాల సంరక్షకుడికి ఇవ్వు. అతను పచ్చిక బీట్లో ఉన్నాడు. మంచి గుర్రాన్ని ఏరి నీకు ఇస్తాడు," ఆ బరాతాన్ని ఇవాన్‌కి ఇస్తూ చెప్పాడు.

ఆ బరాతాన్ని ఇవాన్ గుర్రాల సంరక్షకుడికి అందచేశాడు. అతను దాన్ని చదువుకున్నాడు.

"గుర్రాల్ని నీళ్లకి తోలుకెళ్లేదాకా ఆగు. అప్పుడు వాటిల్లో నీకు నచ్చిన దాన్ని ఏరుకుందువుగాని," అన్నాడు.

సంరక్షకుడు గుర్రాల్ని నీళ్లకి తోలుకు వెళ్లాడు. ఇవాన్ వాటిని పరీక్షగా చూడడం మొదలుపెట్టాడు. కాని ఏదైనా గుర్రం జూలునో, తోకనో పట్టుకోగానే అవి అతని చేతిలోకి ఊడొచ్చేసేవి. ఆ రకంగా అతని చేతిలో చాలా గుర్రాలు నాశనం అయిపోయాయి. వాటిని చంపి చర్మం ఒలిచెయ్యాల్సి వచ్చింది. తనకి నచ్చిన గుర్రం ఒక్కటి కూడా లేకపోవడం చూసి ఇవాన్ తిరిగి వెళ్లిపోవాలని అనుకున్నాడు. అట్లాగే బయలుదేరాడు. కాసేపట్లోనే అతనికి ఒక పూరిల్లు కనిపించింది. దాని కప్పు అంతా చిల్లులే. అప్పుడు ఆకాశం చూస్తేనేమో ముసురు కొస్తోంది. వాన కురిసేటట్టు ఉంది. పూరిల్లు పక్కనే కూర్చున్న ఒక ముసలమ్మ ఇవాన్‌ని చూసి పిలిచింది.

"ఈ బీదదానికి సాయం చెయ్యి నాయనా. ఎవరూ నామీద దయ తలచలేదు. వాన కురిస్తే ఈ చిల్లులతో ఇల్లు అంతా మునిగిపోతుంది," అంది.

ఇవాన్ తన దగ్గరున్న గుర్రం చర్మాలతో వాన నీరు కారకుండా ఆ చిల్లుల్ని కప్పాడు. అతనికి కృతజ్ఞతలు చెప్పేందుకు ఆ ముసలమ్మకి మాటలు దొరకలేదు. అతను ఆమె దగ్గర సెలవు తీసుకుని వెళ్లిపోయాడు.

అతను తిరిగి రాజ భవనానికి వెళ్లాడు. చక్రవర్తి దర్శనం చేసుకున్నాడు. అతనికి తగిన గుర్రం దొరకలేదని తెలిసి చక్రవర్తి ఆశ్చర్యపోయాడు.

"మా అశ్వశాలకి వెళ్లు ఇవాన్. బహుశా అక్కడ నీకు నచ్చిన గుర్రం దొరకవచ్చు," అన్నాడు.

చక్రవర్తి అశ్వశాలకి ఇవాన్ వెళ్లాడు. అక్కడ ఒక గుర్రాన్ని అతను తాకీతాకగానే అది నేల కూలేది. దాంతో ఆఖరికి అక్కడ కూడా ఆ ప్రయత్నం వదులుకోవాల్సి వచ్చింది.

రాత్రయింది. ఇవాన్ పచ్చిక బీట్లోకి వెళ్లి గట్టిగా ఈల వేశాడు. చిత్రం! ఒక గుర్రం పరిగెత్తుకుంటూ వచ్చింది.

"నన్ను పిలిచారా అయ్యా?" అని ఆ గుర్రం అడిగింది.

"ఆఁ, మనం బయలుదేరి వెళ్లే వేళ అయింది."

"తమ చిత్తం. నేను సిద్ధంగా ఉన్నాను."

ఇవాన్ ఆ గుర్రాన్ని చక్రవర్తి అశ్వశాలలోకి తీసుకువెళ్లాడు. ఆ గుర్రం ఎంత భారీగా ఉందంటే శాల గుమ్మాలూ, గోడలూ ఫెళఫెళ కూలిపోయాయి. కాని మొత్తంమీద అతను దాన్ని లోపలికి తీసికెళ్లి కట్టేసి, పుచ్చు పురుగూ లేని శుభ్రమైన గోధుమ ఏరి దాణా పెట్టి నిద్రపోయాడు.

తెల్లవారుతూనే చక్రవర్తి లేచాడు. రైతు కొడుకు ఇవాన్‌ని లేపమని నౌకర్లని పంపాడు. అతను కలలో గుర్రాన్ని చూశాడో లేదో కనుక్కోమ్మని పురమాయించాడు.

నౌకర్లు చక్రవర్తి ఆజ్ఞాపించినట్టే చేశారు.

"గుర్రం సంపాదించాను. అది శాలలో ఉంది," అని ఇవాన్ చెప్పాడు.

వాళ్లు శాలలోకి వెళ్లి చూసి ఆశ్చర్యపోయారు. వెళ్లి చక్రవర్తికి ఆ విషయం చెప్పారు. చక్రవర్తి ఆ గుర్రాన్ని చూసి బెదిరిపోయాడు. తన జీవితంలో ఎన్నడూ అంత భారీ గురాన్ర్ని ఆయన చూడలేదు.

"ఇప్పుడు నాకో పెద్ద గద కావాలి. రెండు జతల ఎడ్లు అడవిలోనుంచి దాన్ని మోసుకు రావాల్సినంత పెద్ద గద కావాలి," అన్నాడు ఇవాన్.

ఆ గదని తెప్పించాడు.

ఇవాన్ దాన్ని గాలిలోకి విసిరేసి నిద్రపోయాడు. ఒక పగలూ రాత్రీ నిద్రపోయాడు. అలాగే మరో రోజు కూడా నిద్రపోయాడు. లేచే వేళకి గద కిందికి ఉరుకుతూ రావడం కనిపించింది. అది అలా దిగివస్తూ ఉంటే 'బజ్ జ్' అని చప్పుడయింది. అతను ఒక వేలిని ఎత్తాడు. గద దానికి తగిలి ముక్కలు ముక్కలైపోయింది.

"చెత్త గద! అడవిలోనుంచి తీసుకు రావడానికి నాలుగు జతల ఎడ్లు అవసరమైనంత గదని తయారు చేయించండి," అన్నాడు ఇవాన్.

వాళ్లు ఒక పెద్ద ఓక్ చెట్టుని కొట్టి పెద్ద గదని చేయించారు. నాలుగు జతల ఎడ్లు దాన్ని అడవిలోనుంచి తీసుకువచ్చాయి. ఇవాన్ దాన్ని గాలిలోకి విసిరేసి నిద్రపోయాడు. మూడు పగళ్లు, మూడు రాత్రుళ్లు నిద్రపోయాడు. లేచే వేళకి గద ఉరుకుతూ రావడం కనిపించింది. అది 'బజ్జ్' అని ధ్వని చేస్తూ వస్తోంది. అతను వేలిని పైకి ఎత్తాడు. గద దానికి తగిలి కింద పడింది. నేలలోకంటా అయిదడుగులు కూరుకుపోయింది.

"ఆఁ, ఇది పనికొస్తుంది," అన్నాడు ఇవాన్.

ప్రయాణానికి సిద్ధమయాడు.

"మా అబ్బాయి కోరిన గుర్రాన్ని తీసుకురా, ఇవాన్. నువ్వు ఏది కోరితే అది ఇస్తాను. మాటలతో కాని, చేతలతో కాని ఎన్నడూ నీకు కీడు చెయ్యనని మాట ఇస్తున్నాను," అన్నాడు చక్రవర్తి.

ఇవాన్ గుర్రంమీద స్వారీ చేసుకుంటూ వెళ్లిపోయాడు. ఒక రైతు కొడుకు ఆ పని నిర్వహించుకు రాగలడని చక్రవర్తి నమ్మలేకపోయాడు. అందుకని గొప్ప వంశీకులైన ఇద్దరు యోధుల్ని అతని వెనకాల పంపాడు.

"రైతు కొడుకు ఇవాన్‌ని అందుకోండి. అతను ఎక్కడికి వెడితే అక్కడికి వెళ్లండి."

వాళ్లు ఇవాన్ వెనకాలే బయలుదేరి వెళ్లారు. కింద భూమి కంపిస్తున్నట్టూ, అదురుతున్నట్టూ ఇవాన్‌కి అనిపించింది.

"ఈ వెంబడించేది మహాకాళం అయినా కావాలి, లేదా కవచంతో ఉన్న యోధులన్నా కావాలి."

చక్రవర్తి యోధులిద్దరూ ఇవాన్‌ని అందుకుని దండం పెట్టారు. "మీరు ఎవరు?" అని ఇవాన్ వాళ్లని అడిగాడు.

"చక్రవర్తి మమ్మల్ని పంపారు. నువ్వు ఎక్కడికి వెడితే మేమూ అక్కడికి వస్తాం," అన్నారు వాళ్లు.

"సరే, మంచిది. మనలో ఒక పద్ధతి ఉండాలీ అంటే మనలో ఎవరో ఒకరు దళ నాయకుడిగా ఉండాలి, మిగిలిన వాళ్లు అతని మాట వినాలి," అన్నాడు ఇవాన్.

"నేను నాయకుడిగా ఉంటాను," అని ఒక యోధుడు అన్నాడు.

"ఉహుం, నేను," అని రెండో అతను అన్నాడు.

"అబ్బెబ్బె, చూడండి, మిత్రులారా! ఇలా లాభం లేదు. మనం మన గదల్ని విసురుదాం. ఎవరి గద ఎక్కువ దూరంలో పడుతుందో వాళ్లు నాయకులుగా ఉంటారు. ఏం?" అన్నాడు ఇవాన్.

అది బాగుందని వాళ్లు ఒప్పందానికి వచ్చారు. ఆ యోధుల్లో మొదటివాడు ముందుకి వచ్చి బలంకొద్దీ గదని విసిరాడు. అది కంటికి కనిపించనంత దూరం పోయింది. ఆ ముగ్గురూ దాన్ని వెతుకుతూ రెండు రోజులు వెళ్లగా వెళ్లగా మూడో రోజున అది బాటమీద కనిపించింది.

తర్వాత రెండో యోధుడు తన గదని విసిరాడు. దాన్ని వెతుకుతూ వాళ్లు మూడు రోజులు వెళ్లినా అది కనిపించలేదు. ఒక వారం రోజులు అలా వెళ్లిన తర్వాత అది కనిపించింది.

ఆ తర్వాత రైతు కొడుకు ఇవాన్ వంతు వచ్చింది. అతను తన గదని విసిరాడు. అప్పుడు ఆ ముగ్గురూ దాన్ని వెతుకుతూ బయలుదేరారు. వాళ్లు ఒక వారం అలా వెళ్ళారు. రెండో వారం, మూడో వారం కూడా వెళుతూనే ఉన్నారు కానీ గద ఎక్కడా కనిపించలేదు.

"చూసుకోకుండా తప్పిపోయామేమో," అన్నారా ఇద్దరు యోధులూ.

"అసంభవం! ఎవరో దాన్ని చూసి ఎత్తుకుపోయి ఉంటారు," అన్నాడు ఇవాన్.

వాళ్లు అలా వెళుతూనే ఉన్నారు. మరో వారం కూడా అయిపోవచ్చింది. అప్పుడు వాళ్లకి ఒక పెద్ద ఇల్లు కనిపించింది. దాని చుట్టూతా రాగి ప్రహరీ గోడ ఉంది. ఆ ఇంటి దగ్గరకి వెళ్లేందుకు రాగి వంతెన ఒకటి ఉంది. చిత్రం! ఇవాన్ గద ఆ ఇంటికి పక్కన నేలమీద పడింది. అది రాగి గోడమీద నుంచి ఎగిరి లోపల పడింది. అలా పడడంలో ఆ ఇంటిని ఒక మూల కూలగొట్టింది.

ఆ ఇల్లు కొన్ని మహాకాళాలది. అవి భయంకరమైన మహాకాళాలు. కాని అవి అప్పుడు ఎక్కడికో యుద్ధానికి వెళ్లాయి. ఆ యోధులు, ఇవాన్ అక్కడికి చేరుకునే వేళకి ఇల్లు ఖాళీగా ఉంది.

ఇంట్లో ఎవరూ లేకపోవడం చూసి మొదటి యోధుడిని వంతెన దగ్గర గస్తీ కాయమని రైతు కొడుకు ఇవాన్ ఆజ్ఞాపించాడు. రెండో అతన్ని గుర్రాల కాపలాకి నియమించాడు. తను మాత్రం లోపలికి వెళ్లి పడకేశాడు.

ఎవరి పనులకి వాళ్లు వెళ్లిపోయారు. వంతెన కాపలా కాసే మనిషి కాసేపు అటూ ఇటూ గస్తీ తిరిగాడు. చాలా దూరం ప్రయాణం చెయ్యడం వల్ల అలసిపోయినట్టు అనిపించి కాసేపు విశ్రాంతి తీసుకుందామని ఒరిగాడు. ఇవాన్ అర్ధరాత్రి లేచి వంతెన దగ్గరికి వచ్చి చూసేప్పటికి అతను గాఢంగా నిద్రపోతున్నాడు.

ఇంతట్లో నేల హఠాత్తుగా కంపించి, అదరడం మొదలుపెట్టింది. ఆరు తలల మహాకాళం ఒకటి ఉరకలమీద వస్తోంది. ఇవాన్ విన్నాడు. అది తన గుర్రానికి చెప్తోంది:

"కదలకుండా నుంచో, సకిలించొద్దు. ఇక్కడ మనల్ని ఎదిరించే వాళ్లెవరూ లేరు. రైతు కొడుకు ఇవాన్ ఒక్కడే మనల్ని ఎదిరించగలడు, వాడు చాలా దూరంలో ఉంటున్నాడు," అంది.

"ఇదుగో మహాకాళం, ఇక్కడున్నాను నేను," అని రైతు కొడుకు ఇవాన్ అన్నాడు.

"నువ్విక్కడ నాతో యుద్ధం చెయ్యడానికి ఉన్నావా, సంధి చేసుకోవడానికా?" అని మహాకాళం అడిగింది.

"యుద్ధానికే. నీతోనా సంధి?"

"సరే అయితే, నువ్వు మొదలుపెట్టు."

"వద్దు, నువ్వే మొదట కానీ. రాజ్యంలో అందరికంటే నువ్వే పెద్ద దానిని కదా."

ఆరు తలల మహాకాళం ఇవాన్ మీదకి లంఘించి అతన్ని కొట్టింది. కాని అతనికి చీమ కుట్టినట్టు కూడా అనిపించలేదు. అప్పుడు ఇవాన్ వంతు వచ్చింది. అతను మహాకాళాన్ని తన గదతో కొట్టాడు. చిత్రం! ఆ ఆరు తలల మహాకాళం దొర్లుకుంటూ నేల కూలింది. అప్పుడు అతను దాన్ని ఖండ ఖండాలుగా నరికి దాని ఎముకలు కాల్చేసి బూడిదని గాలిలో విసిరేశాడు. తర్వాత ఇంట్లోకి వెళ్లాడు.

తెల్లవారింది. వంతెన కాపలా కాయమన్న యోధుడిని పిలిచి గస్తీ ఎలా ఉందని అడిగాడు.

"దివ్యంగా! ఒక్క పిట్ట కూడా మన ఛాయలకి రాలేదు," అని అతను జవాబు చెప్పాడు.

పగలు గడిచి రాత్రయింది. వంతెన కాపలా మనిషిని శాలకి పంపించి, శాల కాపలా మనిషిని వంతెన కాపలాకి పెట్టాడు ఇవాన్.

ఆ రెండో యోధుడూ అలాగే నిద్రపోయాడు. కాని ఇవాన్ అదునులో లేచాడు. వెళ్లి వంతెన దగ్గర నుంచున్నాడు. హఠాత్తుగా భూమి కంపించింది, అదిరింది. తొమ్మిది తలల మహాకాళం ఒకటి స్వారీ చేసుకుంటూ వచ్చింది.

అది గుర్రాన్ని ఆపి ఆరు తలల మహాకాళంలాగానే చెప్పింది. ఇవాన్ ముందటిలాగానే దీనికీ చెప్పాడు.

దాంతో ముందటిలాగానే యుద్ధం మొదలైంది.

తొమ్మిది తలల మహాకాళం ఇక ఆలస్యం చేయలేదు. ఇవాన్‌మీదకి లంఘించి అతన్ని ఎంత

గట్టిగా కొట్టిందంటే ఆ దెబ్బకి అతను మడమల దాకా నేలలోకి కూరుకుపోయాడు. కాని ఇవాన్ ఎదురు దెబ్బ కొట్టాడు. ఒక్క దెబ్బ కొట్టి, ఏడుతలల్ని ఛేదించేశాడు. రెండో దెబ్బకి మిగిలిన రెండు తలలూ పడిపోయాయి. తర్వాత దాన్ని ఖండ ఖండాలుగా కోసేసి, ఎముకలు కాల్చేసి, ఆ బూడిదని గాలిలో విసిరేశాడు. తర్వాత వెళ్లి పడుకున్నాడు.

తెల్లవారిన తర్వాత వంతెన కాపలా కాయమని పురమాయించిన మనిషిని కలుసుకుని గస్తీ ఎలా ఉందని అడిగాడు.

"దివ్యంగా ఉంది. ఎలుక కూడా కదల్లేదు," అన్నాడు.

మూడో రోజున ఇవాన్ ఆ ఇద్దరు యోధుల్నీ ఇంట్లోకి పిలిచాడు. తన హస్తకవచాన్ని గోడకి వేలాడేసి ఈసారి "నేనే స్వయంగా వంతెన కాపలాకి వెళతా. నా హస్తకవచాన్ని మీరు చూస్తూ ఉండండి. దాన్నుంచి చెమట కారిందో హాయిగా తాగి మజా చేసుకోండి. రక్తం కారిందో నా గుర్రాన్ని విప్పేసి దాని దారిన దాన్ని పోనియ్యండి," అని చెప్పాడు.

ఇవాన్ వంతెన దగ్గర నుంచుని ఎదురు చూస్తూ ఉన్నాడు. అర్ధరాత్రికి ముందు భూమి కంపించడం మొదలుపెట్టింది. అదురు ప్రారంభమైంది. ఓక్ చెట్ల ఆకులు రాలిపోయాయి. మహాకాళాల్లోకల్లా పెద్దదైన మహాకాళం స్వారీ చేసుకు వచ్చేస్తోంది. అది నిప్పు తిని, జ్వాలలు తాగే గుర్రంమీద వస్తోంది. వంతెన దగ్గరపడే వేళకి గుర్రాన్ని ఆపింది. ఇదివరకు మహాకాళాలతో జరిగినట్టే దాంతోనూ జరిగింది.

మహాకాళం ఇక ఊరుకోలేదు. ఇవాన్మీదకి లంఘించి ఎంత గట్టిగా కొట్టిందంటే ఇవాన్ పాలిపోయాడు. కాని అతను తడబడకుండా యుద్ధం చేస్తూనే ఉన్నాడు. ఆఖరికి ఆ మహాకాళం పన్నెండు తలల్లోనూ మూడు మాత్రం మిగిలాయి. కాని ఆ మహాకాళం ఇవాన్ని మొలలోతు కంటా నేలలోకి తోసేసింది. ఆ యువకుడి శక్తి హరించుకుపోతోంది. అలా అంతంతగా మిగిలాడు. ఇంతట్లోకీ కాసేపు విశ్రాంతి తీసుకుందాం అని మహాకాళమే సూచించింది.

ఇవాన్కీ అలా విశ్రాంతి తీసుకోవాలనే ఉంది. అంచేత అతను గదని విసిరేశాడు. అది ఎక్కువ దూరం పోయి పడింది. ఆ పడ్డంలో అశ్వశాల గోడని కూలగొట్టింది. ఇవాన్ గుర్రం కట్టు విప్పుకుని అతని దగ్గరికి దౌడు తీస్తూ వెళ్లింది. వెళ్ళి గిట్టలతో మట్టి తవ్వడం మొదలుపెట్టింది.

ఆ ఇద్దరు యోధులూ నిద్రలేచారు. ఇవాన్ హస్తకవచం నుంచి రక్తం కారుతోంది. కాని వాళ్లకి భయం వేసింది. అతనికి సహాయం చెయ్యడానికి వెళ్లలేదు.

"మనకెందుకొచ్చిన తద్దినం?" అనుకున్నారు వాళ్లు.

ఈలోపున ఇవాన్ గుర్రం మట్టినంతట్నీ తోడేసింది. ఇవాన్ని బయట పడేసింది.

అప్పుడు ఇవాన్ మహాకాళంతో "ఇక నీపని ఆఖరు. మహాకాళం, నిన్ను మట్టుపెడతా," అన్నాడు.

“ఆ విషయం నాకు తెలుసు. కాని నేను చనిపోయే లోపున ఒక సంగతి నీకు చెబుతా, ఇవాన్. ఈ మహిమాశ్వాన్ని నా దగ్గర్నుంచి నువ్వు తీసికెళ్ళగలిగినా, దాన్ని చక్రవర్తి దగ్గరికి తీసికెళ్ళలేవు. ఏమంటే మా అమ్మ, మా నాన్న చక్రవర్తి హీరొద్, నా ముగ్గురు అక్కచెల్లెళ్లు నిన్ను తుదముట్టిస్తారు,” అంది.

ఇవాన్ ఆ మహాకాళం మిగిలిన తలలు మూడింటినీ ఖండించాడు. ఆ మహాకాళం చేసిన హెచ్చరిక గురించి ఆలోచిస్తూ అక్కడనే నుంచుండి పోయాడు. ఏం చెయ్యాలో అతనికి తోచలేదు. గుర్రం చర్మాలతో వాన కారకుండా ఇంటి కప్పుకి ఇవాన్ మాటు వేశాడే, ఆ ముసలమ్మకి ప్రపంచంలో అన్నీ తెలుసు. ఇవాన్ ఏదో ఆపదలో ఉన్నాడని ఆమెకి అనిపించింది. అందుకని ఆమె తన చిన్న కుక్కని పంపింది. కుక్క ఇవాన్ దగ్గరికి వచ్చింది.

“నువ్వు త్వరలోనే చక్రవర్తి ప్రాసాదానికి బయల్దేరతావు. బాటకి కుడి వైపున నీకు ఒక జలఊట కనిపిస్తుంది. దానిలో నీళ్లు గాజు అంత స్వచ్ఛంగా ఉంటాయి. నీకు నాలిక పిడచకట్టుకు పోయేటంత దాహంగా ఉన్నాగానీ నువ్వు ఆ నీళ్లు తాగకూడదు. అందుకు బదులుగా నువ్వు దాన్ని అడ్డంగా నీ గదతో కొట్టి చూడు ఏం కనిపిస్తుందో. ఆ తర్వాత ఇంకా ముందుకి వెళ్లే కొద్దీ నీకు ఒక చెట్టు కనిపిస్తుంది. ఆ చెట్టు కింద ఒక మేజా ఉంటుంది. దానిమీద భోజనం, మద్యం వడ్డించి ఉంటాయి. నువ్వు నకనకలాడిపోయే ఆకలితో ఉన్నాగానీ వాటిని తాకను కూడా తాకకూడదు. ఆ మేజాని అడ్డంగా నీ గదతో కొట్టు, అప్పుడు చూడు ఏం కనిపిస్తుందో. తర్వాత ఇంకో చెట్టు కనిపిస్తుంది. దాని కింద మంచం, పరుపు ఉంటాయి. నీకు కళ్లు కూరుకుపోయేటంత నిద్ర ముంచుకు వస్తున్నాగానీ దానిమీద పడుకోకు. దానికి బదులుగా నీ గదతో దాన్ని అడ్డంగా కొట్టి చూడు ఏం కనిపిస్తుందో!” అని కుక్క ఇవాన్‌కి చెప్పింది.

ఆ కుక్క చెప్పిందంతా ఇవాన్ విన్నాడు. మహాకాళం నుంచి లాక్కున్న మహిమాశ్వం తీసుకుని చక్రవర్తి రాజభవనానికి బయల్దేరాడు. ఆ ఇద్దరు యోధులూ కూడా వెళ్లారు. వాళ్లు అలా అలా స్వారీ చేసుకు వెళ్లారు. కొంచెం సేపటి తర్వాత వాళ్లకి గొంతుక ఆరిపోయేటంత దాహం వేసింది. బాటకి కుడి వైపున వాళ్లకి ఒక జలధార కనిపించింది. ఆ ఇద్దరు యోధులూ నీళ్లు తాగుదాం అనుకున్నారు.

కాని ఇవాన్ “వద్దు, ముందు నేనోసారి ఈ జలధారని చూస్తాను,” అన్నాడు. అతనా నీటిని గదతో కొట్టాడు. చిత్రం! అది రక్తంతో ఎర్రగా అయిపోయింది. తీరా చూస్తే అది జలధార కానే కాదు, ఆ రూపంలో ఉన్న మహాకాళం చెల్లెలు.

వాళ్లు అలా ముందుకు సాగారు. మహాకాళం మిగిలిన ఇద్దరు చెల్లెళ్లనీ ఇవాన్ చంపేశాడు. వాళ్లల్లో ఒకామె భోజనం వడ్డించిన మేజా రూపం, మరొకామె పరుపు వేసిన మంచం రూపాల్లో ఉన్నారు. ఇంతలో ఆకాశం ఉన్నట్టుండి చిమ్మ చీకటి అయింది. ఓ మేఘం కమ్ముకు రావడం కంట

బడింది. కొంచెం తేరి చూస్తే అది మేఘం కాదనీ, ఆ రూపంలో ఉన్న మహాకాళం తల్లి అనీ వాళ్లకి తెలిసింది. దాని పై పెదవి ఆకాశాన్నీ కింది పెదవి భూమినీ తాకుతున్నాయి.

"రండి, అన్నలారా, ఈ మహాకాళంతో యుద్ధం చేద్దాం. ఒక్కడినీ దీన్ని ఆపలేను," అని ఇవాన్ యోధులతో అన్నాడు.

చక్రవర్తి యోధులిద్దరూ భయపడి కాలికి బుద్ధి చెప్పారు.

'ఇక నా పని అయిపోయినట్టే,' అనుకున్నాడు ఇవాన్. దగ్గర్లోనే ఓ కమ్మరి కార్ఖానా ఉందని గుర్తు వచ్చింది. గుర్రాన్ని దౌడు తీయించి ఆ కార్ఖానా దగ్గరికి వెళ్లాడు. ఆ ఇద్దరు యోధులూ మళ్లీ తిరిగి అతని దగ్గరికే వచ్చారు. ఏమంటే ఎక్కడా దాక్కునే చోటు వాళ్లకి దొరకలేదు.

వాళ్లు కార్ఖానా దగ్గరికి వెళ్లి కమ్మరి వాళ్లని పిలిచారు. తమని లోపలికి రానిమ్మని అడిగారు. ఆ కమ్మర్లు కార్ఖానా పన్నెండు ఇనప గుమ్మాలనీ తెరిచారు. వాళ్లు లోపలికి వెళ్లాక ఆ తలుపులు మూసుకుపోయాయి. కాని తల్లి మహాకాళం కార్ఖానా పైకి ఎక్కి తన జ్వాలా జిహ్వతో కార్ఖానా తలుపుల్ని నాకడం మొదలుపెట్టింది.

అది తమాషాగా కొట్టి పారెయ్యాల్సిన విషయం కాదని రైతు కొడుకు ఇవాన్ గమనించాడు.

"గబగబా నాకో నాగలినీ, పట్టకారునీ తయారు చేసి ఇవ్వండి. ఈ కార్ఖానా అంత పెద్ద వాటిని," అని కమ్మరి వాళ్లతో చెప్పాడు.

కమ్మరి వాళ్లు పని మొదలుపెట్టారు. వ్యవధి చూస్తే తక్కువగా ఉంది. మహాకాళం ఏమో అప్పుడే చాలా తలుపులని దగ్ధం చేసేసింది. అయినాగానీ వాళ్లు శరవేగంతో నాగలినీ, పట్టకారునీ తయారుచేసి ఇచ్చారు. మహాకాళం పదవ తలుపుని దగ్ధం చెయ్యడం మొదలుపెట్టే వేళకి అవి తయారయ్యాయి.

తల్లి మహాకాళం ఆఖరి తలుపుని దగ్ధం చేసి తల లోపలికి పెట్టింది. వెంటనే ఇవాన్ దాని నాలుకని పట్టకారుతో పట్టుకుని బలం అంతా ఉపయోగించి నొక్కేశాడు. అప్పుడు దాన్ని నాగలికి కట్టాడు. దాని చేత బలవంతంగా పొలం దున్నించాడు. అలా దున్నుతూ ఉంటే ఒక్కొక్కటీ ఒక్కో ఇంటి పరిమాణం అంతేసి ఉన్న మట్టి పెళ్లలు ఊడిపడ్డాయి. అలా దున్నుతూ ఇవాన్ తల్లి మహాకాళాన్ని అటు వేపూ ఇటువేపూ ఛెళ్లు ఛెళ్లున కొట్టాడు. దాని నాలుకని పట్టకారుతో ఇంకా గట్టిగా నొక్కాడు. ఆగకుండా నాలుగు గంటలు అలా దున్నేసరికి తల్లి మహాకాళం తట్టుకోలేక ఠాప్‌మని చచ్చింది.

అప్పుడు అతను దాన్ని సముద్రంలో పారేసి గుర్రాన్ని పొలంలో మేతకి వదిలి ఆ ఇద్దరు యోధుల్నీ తరిమేశాడు.

"ఛస్ పొండి పిరికి పందలూ! గొప్పింటి పుట్టుక పుడితే పుట్టారు కాని నాకు కడుపు ఉడికి పోయేటట్టు చేశారు. మీవల్ల నాకు యాతన తప్ప ఏం లాభం లేకపోయింది," అని తిట్టాడు.

తర్వాత మహిమాశ్వం ఎక్కి వెళ్లిపోయాడు.

అంతలో ఇవాన్‌కి ఒక ముసలతను తగిలాడు. అతను ఆ ముసలతనికి నమస్కారం చెయ్యకుండానే దాటి వెళ్లిపోయాడు. కాని ఎందుకైనా మంచిది లెమ్మని ఆలోచన వచ్చి వెనక్కి తిరిగాడు.

'నేను కుర్రాడిని, పెద్దాయనకి మర్యాద చూపించాలి,' అనుకున్నాడు.

వెనక్కి తిరిగి వచ్చి ఆ ముసలతన్ని అందుకుని "పొరపాటై పోయింది, ఏమీ అనుకోకు తాతా నీకు నమస్కారం చెయ్యకుండా వెళ్లిపోయాను," అన్నాడు.

"కుర్రవాళ్లు తప్పకుండా తమకంటే పెద్దవాళ్లని ముందు గౌరవించి నమస్కారం చెయ్యాలి. మరిచిపోకు," అని హితవు చెప్పి ముసలతను ఇలా అన్నాడు: "ఇప్పుడు విను. నువ్వు వెళుతూ ఉంటే నీకో ముసలతను ఎదురౌతాడు. అతనికి కొయ్యకాలు. అతను నిన్ను ఆపి 'నీ గుర్రం భలే ఉందే అబ్బాయ్, దీంతోనా నువ్వు ముందుకు సాగగలిగేది!' అంటాడు. గుర్తుంచుకో నువ్వు ఎట్టి పరిస్థితుల్లోనూ అతనితో పందెం వెయ్యొద్దు, ఇది మొదటి విషయం. ఇక రెండో విషయం. నీకు దారిలో ఎవరు ఎదురైనా నీతో తీసుకెళ్లనని అనకు," అని చెప్పాడు.

ఇవాన్ అలా ముందుకు వెళ్లాడు. ఇంతలోకీ ఒక ముసలతను కుంటుకుంటూ అతని దగ్గరికి వచ్చాడు.

"ఏం గుర్రమయ్యా నీది! నేను రోగిష్టి ముసలాడిని అయినా నన్ను దాటి అది ముందుకు పోలేదు కదా!" అన్నాడు.

"ఏమయ్యోయ్, నేనేం నీతో పందెం వెయ్యను," అన్నాడు ఇవాన్.

ఇవాన్ నోట్లోనుంచి ఆ మాటలు వచ్చాయో లేదో ఆ ముసలాడు బాణంతో కొట్టి ఇవాన్‌ని జీను మీదనుంచి కిందికి తోసేశాడు. అలా తోసేసి గుర్రం ఎక్కి రెప్పపాటులో దూసుకుపోయాడు. అసలదంతా ఎలా  జరిగిందో ఇవాన్‌కి తట్టనే లేదు. ఏమంటే ఆ ముసలాడు ఎవరో కాదు. ఆ వేషంలో ఉన్న మహాకాళం తండ్రి చక్రవర్తి హీరొద్.

ఇవాన్ కోపంతో ఊగిపోయాడు.

"నిన్ను తగలెయ్య చక్రవర్తి హీరొద్! ఆగు, నువ్వెక్కడున్నా గాలించి పట్టేస్తాను, కాలినడకనే అంత దూరం రావాల్సి ఉన్నా గానీ," అన్నాడు.

అప్పుడు తన గద తీసుకుని హీరొద్ వెంటబడ్డాడు. కాని అతని గాయం మంట పెడుతోంది. అతని శక్తి సన్నగిల్లిపోతోంది.

'చక్రవర్తి హీరొద్ బాణం విషపూరితమైందేమో,' అనుకున్నాడు.

అతను కొంచెం దూరం నడిచాడు. ఉన్న శక్తి కాస్తా ఉడిగి పోయిందనిపించింది.

'చక్రవర్తి హీరొద్‌ని జయించలేనింక. నా ప్రాణం పిండేస్తాడు ఒక్క వేలితో,' అనుకున్నాడు.

రైతు కొడుకు ఇవాన్ తల వాలేసుకుని ముందుకు నడిచాడు. అతనికి దారిలో ఒక ముసలాడు

తగిలాడు. ఆ ముసలతని గడ్డం నేలకి తగిలేంత పొడుగ్గా ఉంది. వాళ్లు ఒకరికొకరు నమస్కారం చేసుకున్నారు. ఇవాన్ ఎక్కడికి వెళుతున్నాడో విని ఆ ముసలతను తను కూడా వస్తానన్నాడు.

"ఎవరు నువ్వు?" అని ఇవాన్ అడిగాడు.

"నన్ను కుక్కల వేటగాడు అంటారు. కుక్కలు నన్ను చూసి బెదురుతాయి," అని ముసలతను జవాబు చెప్పాడు.

ఇవాన్ అతనికేసి ఆశ్చర్యపోయి చూశాడు. కాని మొదట కనిపించిన ముసలాయన ఇచ్చిన సలహా గుర్తుకు వచ్చింది. అందుకని ఏమీ అనలేదు.

ఆ ఇద్దరూ కలిసి ముందుకు వెళ్లారు. కొంచెం సేపట్లో వాళ్లకి మరో ముసలాయన తగిలాడు. అతని పేరు మంచు.

ముగ్గురూ కలిసి ముందుకు వెళ్లారు. అప్పుడు మరో ముసలతను కలిశాడు.

"నన్ను సముద్రహలి అంటారు. నేను సముద్రాన్ని కోసేసి అలల్ని మోపుకట్టేస్తాను," అన్నాడతను.

నలుగురూ కలిసి ముందుకు సాగారు. కొంచెం సేపట్లోనే మరో అయిదుమంది వచ్చి వాళ్లతో కలిశారు. ఎంతతిన్నా ఇంకా కావాలనే భోజనప్రియుడు, ఎంత తాగినా ఇంకా తెమ్మనే పానప్రియుడు, ఆగకుండా పరిగెత్తేవాడు, బారు కొరడా, నిశిత దృక్కు అనేవి వాళ్ళ పేర్లు.

ఇప్పుడు వాళ్లు మొత్తం తొమ్మండుగురు అయ్యారు. వాళ్లంతా కలిసి చక్రవర్తి హీరొద్ రాజ్యానికి బయలుదేరారు. కొంచెం సేపట్లోనే సరిహద్దులు దాటారు.

చక్రవర్తి హీరొద్ వాళ్లని చూసి ఆశ్చర్యపోయాడు. ఏమంటే అంతకు ముందు ఎవరూ అతని రాజ్యంలోకి అడుగు పెట్టి ఎరగరు. అతను తన నౌకర్లని పిలిచాడు. ఇవాన్‌మీదకీ, అతని మిత్రులమీదకీ ఏడు వేల రెండు తలల కుక్కల్ని వదలమన్నాడు. జీబురు మేఘంలాగా ఆ కుక్కలు వాళ్ళమీదకి ఉరికాయి.

"ఈ కుక్కలు మనల్ని చీల్చేస్తాయి. నాకు అసలు ఓపికలేదు, కదలను కూడా కదల్లేను," అన్నాడు రైతు కొడుకు ఇవాన్.

"కుక్కలన్నీ భయపడే మనిషిని నేను ఉన్నాగా, మరిచిపోయావా?" అని కుక్కల వేటగాడు అన్నాడు.

అతను కుక్కలకి ఎదురు వెళ్లి అన్నిటినీ చంపేశాడు.

దాంతో ఇవాన్, అతని మిత్రులూ ముందుకు వెళ్లేందుకు ఆటంకం లేకపోయింది. వాళ్లు చక్రవర్తి హీరొద్ కోటకేసి వెళ్లారు. వాళ్లు కోట గుమ్మం చేరుకున్నారు. దాన్ని ఇనుముతో చేశారు. అది చాలా పెద్దది. దాన్ని తెరిచి వాళ్లు లోపలికి వెళ్లారు. వెళ్లగానే ఆ ఇనప తలుపులు మూసుకుపోయాయి. దాంతో వాళ్లు నాలుగు ఇనప గోడల బోనులో చిక్కుకుపోయారు. చక్రవర్తి హీరొద్ అగ్గి పెట్టి వాళ్లని సజీవంగా దహనం చేసెయ్యమని తన నౌకర్లకి పురమాయించాడు.

మంచు అనే పేరున్న ముసలి అతను శీతలశ్వాస విడిచాడు. నౌకర్లు కొండల కొద్దీ కట్టెలు పడేస్తూ ఉన్నా పెద్దమంట రగిల్చినా ఏం లాభం లేకపోయింది. మంచు కమ్మేసింది. చక్రవర్తి హీరొద్‌కి అలా అవుతుందనే అనుమానమే కలగలేదు. తన నౌకర్లని పిలిచాడు.

“వెళ్లి తలుపులు తెరవండి. ఇవాన్ ఎముకలు బూడిద అయిపోయి ఉంటాయి. కెలికి తియ్యండి,” అని చెప్పాడు.

నౌకర్లు తలుపులు తెరిచి చూశారు. చిత్రం! ఎదురుగుండా ఇవాన్, అతని మిత్రులూ చెక్కు చెదరకుండా ఉన్నారు.

“చక్రవర్తి హీరొద్, మామీద మీరు కనికరం చూపించలేదు. ఇంత చల్లని గదిలో మమ్మల్ని పెట్టారు. చలికి గడ్డగట్టిపోయాం,” అన్నాడు ఇవాన్.

“రైతు కొడుకు ఇవాన్, ఇలా అయినా, మరోలా అయినా ఒకటే మీకు. నేను ఎలాగూ నీ తలను నరికేస్తాను. నేను మీమీదకి విసిరిన విష బాణం నీ శక్తిని హరించేసింది. నువ్వేం చెయ్యలేవు,” అన్నాడు చక్రవర్తి హీరొద్. కాని అంతలోకి “నేను ఇతన్ని ఎప్పుడైనా చంపెయ్యగలను. కొంచెం ఏడిపించి సరదా తీర్చుకుంటే ఏం పోయింది!” అనుకున్నాడు.

“నీకూ నీ మనుషులకీ ఒక పని ఇస్తున్నా. నువ్వు గనక దాన్ని నిర్వహిస్తే మిమ్మల్ని వదిలేస్తా. లేకపోతే మీ తలలు తరిగించేస్తా. సముద్రాన్ని కోసి అలల్ని మోపులు కట్టాలి. ఈ పనంతా ఒక్క రాత్రిలో చెయ్యాలి,” అన్నాడు.

చక్రవర్తి వెళ్లి పడుకున్నాడు. సముద్రహాలి అనే పేరున్న ముసలతను వెంటనే పని మొదలుపెట్టాడు. తెల్లవారే వేళకి సముద్రం అంతట్నీ కోసేసి అలల్ని మోపు కట్టేశాడు. చక్రవర్తి హీరొద్ లేచి చూస్తే, చిత్రం! సముద్రం ఉన్న చోట ఒక్క నీటి చుక్క కూడా లేదు. అతనికి చాలా ఆశ్చర్యం కలిగింది. కాని పైకి ఏమీ అనలేదు.

“అంతటితో అయిపోయిందని అనుకోకండి. మరో పని ఉంది. నాకు చాలా పశుగణం ఉంది. వాటిని చంపేసి, మాంసం వేయించి పెడతాను. మీరు మొత్తం తినెయ్యాలి. అలాచేస్తే మిమ్మల్ని వదిలిపెడతా, లేకపోతే మిమ్మల్ని చంపిస్తా.”

రైతు కొడుకు ఇవాన్ అది విని ‘నాకు ఈ నీరసం గనక లేకపోయినట్లయితే బాగుండేది. చక్రవర్తి హీరొద్‌కి వేళాకోళం చెయ్యడమంటే ఏమిటో చూపించి ఉండేవాడిని,’ అనుకున్నాడు.

చక్రవర్తి హీరొద్ బందీలలో ఒక అందమైన పడుచు అమ్మాయి ఉంది. ఆమెకి రకరకాల మూలికలూ, గరికలూ తెలుసు. ఆమె ఇవాన్‌కి నయం చెయ్యక ముందే చక్రవర్తి బానల కొద్దీ మాంసం వండించి, పీపాల కొద్దీ సారా తెప్పించాడు. వాటినన్నిటినీ పెట్టేందుకు పెరట్లో జాగా లేకపోయింది.

ఇవాన్, అతని మిత్రులూ తినడం మొదలుపెట్టారు. ఒక్క ఎద్దు వేపుడు తినేటప్పటికి వాళ్ల పని అయిపోయింది. ఇక తినలేకపోయారు. ఏడుపు ముఖాలేసుకుని కూర్చున్నారు.

"మూడేళ్లల్లో కూడా ఇంత తిండి తినలేం," అన్నాడు ఇవాన్.

అప్పుడు వాళ్లకి తమ పంక్తిని ఇద్దరు లేరే అని గుర్తుకు వచ్చింది. తెగతిని ఇంకా కావాలనేవాడు, పూటుగాతాగి ఇంకా తెమ్మనేవాడు లేరు. వాళ్లని పిలిచారు. ఆ ఇద్దరూ కూర్చుని గబగబ మొత్తం తినేసి, తాగేసి ఒక్క పిసరు కూడా మిగిల్చారు కాదు. చాలలేదన్నారు. ఇంకా తెమ్మన్నారు.

ఇవాన్, అతని మిత్రులూ చెయ్యలేని పనిని చెప్పడం కష్టమని చక్రవర్తి హీరొద్‌కి అర్థమైంది. చంపేద్దామా అనుకుని పోనీ మరి కొంచెం ఏడిపిద్దామని కాలయాపన చేశాడు.

"ఇదుగో మీకు మరో పని చెప్తా. మీరు రేపు సముద్రం ఒడ్డుకి వెళ్లి కొంచెం సముద్రం నీటిని తెండి. మా అమ్మాయి శీఘ్రపాదం కంటే వేగంగా తేగలిగారో మిమ్మల్ని వదిలిపెడతా, లేకపోతే చంపించేస్తా," అన్నాడు.

ఇవాన్ అంతసేపూ అక్కడే నుంచుని త్వరగా తనకి నయమైతే బాగుండునని కోరుకుంటున్నాడు. అప్పుడు చక్రవర్తి హీరొద్‌తో యుద్ధం చేసి జయించవచ్చు. ఇవాన్ మనసు గ్రహించిన అందమైన బందీ అమ్మాయి "విచారించకు ఇవాన్, త్వరలోనే నీకు నయం అయిపోతుంది," అని చెప్పింది.

ఆ రాత్రి గడిచింది. తెల్లవారింది. చక్రవర్తి హీరొద్ కూతురు శీఘ్రపాదం పాదుకా సిద్ధితో, తిరస్కరిణీ టోపీతో ఒక బాల్చీ తీసుకుని మాయమైపోయింది. సముద్ర తీరానికి వెళ్లిపోయింది. ఎవరిని నీళ్ల కోసం పంపాలా అనుకుంటూ ఇవాన్ అతని మిత్రులూ అక్కడ కూర్చుండిపోయారు. అప్పుడు వాళ్లకి ఆగకుండా పరిగెత్తేవాడు తమతో ఉన్నాడని గుర్తొచ్చింది. వెంటనే అతన్ని పిలిచారు. అతను వెంటనే సముద్రం ఒడ్డుకి గెంతి వెళ్లిపోయాడు. శీఘ్రపాదం తిరిగి రావడానికి చాలా ముందే బాల్చీడు నీళ్లు పట్టుకొచ్చాడు. కానీ శీఘ్రపాదం అతన్ని చూసి ఓ పిడికెడు నిద్రమత్తు పొడి అతని కాళ్లకింద వేసింది. దాంతో అతను నేలమీద వాలి గుర్రుకొట్టి నిద్రపోయాడు.

ఇవాన్, అతని మిత్రులూ శీఘ్రపాదం పరిగెత్తుకుంటూ రావడం చూశారు. కాని ఆగకుండా పరిగెత్తేవాడు నిద్రపోతూ కనిపించాడు. బారు కొరడా తన కొరడాతో అతన్ని కొట్టాడు. ఆగకుండా పరిగెత్తేవాడు ఠకామని లేచి బాల్చీ అందుకుని శీఘ్రపాదం కంటే ముందే వచ్చేశాడు.

ఇవాన్, అతని మిత్రులూ చెయ్యలేనిది ఏదీ లేదని చక్రవర్తి హీరొద్ గ్రహించాడు. అందుకని కత్తి దూసి, ఇవాన్‌నీ అతని మిత్రుల్నీ నూర్పిడి కళ్లంలోకి తీసుకు పొమ్మని నౌకర్లకి పురమాయించాడు. వాళ్లు ఇవాన్‌ని తీసుకువెళుతూ ఉండగా ఇవాన్‌కి నయం చేస్తూ ఉన్న అమ్మాయి అతనికి నయం అయిందని మెల్లిగా అనడం వాళ్లకి వినిపించింది. చక్రవర్తి హీరొద్ ఇవాన్ తలని నరుకుదామని రాగానే ఇవాన్ అతన్ని పట్టుకుని కోట బురుజు మీదకి విసిరేశాడు. ఆ కొన చక్రవర్తి శరీరంలో గుచ్చుకుని చక్రవర్తి హీరొద్ ప్రాణం విడిచాడు.

చక్రవర్తి హీరొద్ లాక్కున్న గుర్రాన్ని తీసుకుని ఇవాన్ తన దేశానికి బయలుదేరాడు. తనకి నయం చేసిన అమ్మాయిని కూడా తీసుకువెళ్లాడు. ఆ ముసలి వాళ్లని కూడా తనతో రమ్మన్నాడు. కాని వాళ్లు రామని అన్నారు.

వాళ్లు ఆలింగనం చేసుకుని సెలవు తీసుకున్నారు.

ఇవాన్ ఆ అమ్మాయితో కలిసి తన దేశానికి వెళ్లాడు. చక్రవర్తి దగ్గరికి నిప్పు తిని, జ్వాలలు తాగే గుర్రాన్ని ఇవాన్ తీసుకెళ్లాడు. కాని చక్రవర్తి ఇవాన్ వెనక పంపిన ఇద్దరు యోధులూ ఇవాన్ తనతో కూడా తీసుకువచ్చిన ఆ అమ్మాయిని చూసి ఇవాన్ వెనకాలే రాజ భవనానికి బయలుదేరారు.

"ఇవాన్ ఎవరండీ? సాదా రైతు కొడుకు. అలాంటి వాడా ఇలాంటి ముచ్చటైన అమ్మాయిని పెళ్లి చేసుకోవడం! గొప్పింటి వాడే ఈ పిల్లకి తగిన వరుడు," అని అన్నారు.

ఇవాన్ పాలిపోయాడు.

"నేనీ పిల్లని బందిఖానానుంచి విడిపించాను. మేమిద్దరం ప్రేమించుకున్నాం. ఈ అమ్మాయిని ప్రాణం పోయినా వదులుకోను," అన్నాడు ఇవాన్.

"నేను ఆజ్ఞాపిస్తే వదులు కోవాలి నువ్వు," అన్నాడు చక్రవర్తి.

ఇవాన్‌కి చర్రున కోపం వచ్చేసింది.

"చక్రవర్తీ, మరిచిపోయారా? నేను ఏది అడిగితే దాన్ని ఇస్తానని మీరు మాట ఇచ్చారు. నాకు ఎన్నడూ కీడు తలపెట్టనని అన్నారు. నేను మూడు మహాకాళాలని, వాటి కుటుంబాలని చంపాను. మీరు మీ మాటని నిలబెట్టుకునే పద్ధతి ఇదే అయితే మిమ్మల్ని చంపేస్తాను, మీ బంధు మిత్రులందర్నీ ఒక్క గదాఘాతంతో హతమారుస్తాను," అన్నాడు.

అతను గదని ఊపాడు. చెట్లన్నీ నేలమీదకి వంగిపోయాయి. చక్రవర్తి ప్రాసాదం కదిలిపోయింది.

చక్రవర్తికి భయం వేసింది. మరొక్క మాట బదులు చెప్పలేదు. రైతు కొడుకు ఇవాన్ తను ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకుని సుఖంగా కాపరం చేసుకున్నాడు. కాని ఆ తర్వాత చక్రవర్తి మాటలని గాని, ప్రభువుల మాటలని గాని ఎన్నడూ నమ్మలేదు.

# గొర్రెల కాపరి

ఒకప్పుడు ఒక గొర్రెల కాపరి ఉండేవాడు. అతను గొర్రెల్ని కాసేవాడు. చిన్నప్పటి నుంచీ అతను అది తప్ప ఇంకేం చేసేవాడు కాదు.

ఒక రోజున అయిదు మణుగుల బరువున్న బండరాయి ఒకటి ఆకాశంలోనుంచి అతని పక్కన పడింది. అది ఏదో ఆట వస్తువు అయినట్టుగా అతను దాంతో ఆడుకున్నాడు. అతనికి కనక గుబులు పుడితే ఆ బండరాయిని కొరడాకి కట్టి ఆకాశంలోకి విసిరేసి నిద్ర పోయేవాడు. రాత్రి చీకటి పడే వేళకి లేచేవాడు. అప్పటికి ఆ బండరాయి దూసుకుంటూ కిందికి పడేది.

ఆ బండరాతితో ఆడుకుంటున్నందుకు వాళ్లమ్మ తిట్టేది. అయినా వాడు లక్ష్యపెట్టేవాడు కాదు.

అప్పుడో విషయం జరిగింది. చక్రవర్తి ఉంటూన్న నగరాన్ని ఒక మహాకాళం ముట్టడించింది. అది ఎనిమిది మణుగుల బరువుండే రాళ్లని మోసుకొచ్చి కింద పారేసి ఒక ప్రాసాదం కట్టడం మొదలుపెట్టింది. చక్రవర్తి తన కూతురుని ఇచ్చి పెళ్లి చెయ్యాలని రొక్కించింది.


చక్రవర్తి భయపడిపోయి రాజ్యం నలుమూలలా దండోరా వేయించాడు. ఆ మహాకాళంతో యుద్ధం చేసి దాన్ని చంపగల బలిష్టుడూ, ధైర్యవంతుడూ ఎవడున్నాడు, ఆ విషయం తెలిసిన వాళ్లు ఎవరైనా గాని వచ్చి తనకి చెప్పాలి అని చాటించాడు. కాని అలాంటి వాడు ఉన్నాడని ఎవరూ విని ఉండలేదు.

ఆ వార్త గొర్రెల కాపరి చెవిన పడింది.

“నేనా మహాకాళాన్ని నా కొరడాతో చంపేస్తా,”నని వాడు డాబులు కొట్టాడు.

వాడు తమాషాకే అని ఉండవచ్చు. కాని ఆ మాటలు విన్న వాళ్లు అతన్ని నమ్మి చక్రవర్తికి చెప్పారు. వెంటనే చక్రవర్తి అతని కోసం కబురు పెట్టాడు.

“నువ్వేమన్నావో ఆ పని చెయ్యగలనన్న నమ్మకం నీకుందా? నువ్వు చూస్తే పిల్లాడిలా ఉన్నావ్?” అన్నాడు చక్రవర్తి.



"చెయ్యగలను," అన్నాడు వాడు.

అప్పుడు చక్రవర్తి రెండు దళాలని అతనికి అప్పగించాడు. ఆ గొర్రెల కాపరి ఎంత బింకంగా ఆజ్ఞలు జారీ చెయ్యడం మొదలు పెట్టాడంటే చూసేవాళ్లకి అమ్మో ఇతనికి సైన్యంలో కనీసం ఇరవై ఏళ్ల అనుభవం ఉండి ఉండాలి అనిపిస్తుంది.

చక్రవర్తి అదంతా చూసి ఆశ్చర్యపోయాడు.

గొర్రెల కాపరి మహాకాళం ఉంటున్న ప్రాసాదం దగ్గరికి తన దళాలని తీసుకెళ్లాడు. "గొట్టం నుంచి పొగ గనక చిమ్ముకుంటూ వస్తే మహాకాళం మీద నేను పై చెయ్యిగా ఉన్నట్టు. జ్వాలలు గనక ఎగిసి వస్తూ ఉంటే మహాకాళం పై చెయ్యిగా ఉన్నట్టు," అని ఆ దళాలకి చెప్పాడు.

అలా చెప్పి, ఆ దళాలని అక్కడ ఉంచి తను ఒక్కడూ ప్రాసాదంలోకి వెళ్లాడు.

ఆ మహాకాళానికి తన బలం బాగా తెలుసు. తన దగ్గరకి రావాలని ప్రయత్నించిన వాళ్లని ఎక్కడి వాళ్లను అక్కడ తన అగ్ని శ్వాస వదిలి నిలబెట్టేది. అంచేత గొర్రెల కాపరిని చూడగానే అది అలానే చేసింది. కాని అలా చెయ్యడం ఏం లాభం లేకపోయింది. ఆ గొర్రెల కాపరికి చీమ కుట్టినట్టయినా అనిపించలేదు.

"ఏం, బాబూ! ఇలా వచ్చావ్? నాతో యుద్ధం చెయ్యాలనుకుంటున్నావా? సంధి కుదుర్చుకుంటావా?" అని గంయ్‌మంది.

"మహాకాళం, నీతో యుద్ధం చెయ్యడానికి వచ్చాను. నీ బోంట్లతో సంధి చేసుకుంటాననుకున్నావ్?" అని గొర్రెల కాపరి జవాబిచ్చాడు.

"అలాగా! అయితే వెళ్లి విశ్రాంతిగా శక్తి పుంజుకుని మూడేళ్ల తర్వాత రా, ఏం?" అంది మహాకాళం.

"అవసరం లేదు, ఆ మాత్రం శక్తి ఇప్పుడే ఉంది."

"మరి నీ దగ్గర ఆయుధాలేం ఉన్నాయి?"

"నా కొరడా."

అతను మహాకాళానికి తన కొరడా చూపించాడు. మొత్తం ఒక ఎద్దు చర్మం అంతటినీ పెట్టి దాని కమ్చీ తయారు చేశారు. దాని కోలకి బండరాతిని కట్టారు.

"సరే, నువ్వే మొదలుపెట్టు," అంది మహాకాళం.

"ఉహూం, నువ్వే కానీ."

మహాకాళం ఇక వెనకా ముందూ చూడలేదు. అది గొర్రెల కాపరి దగ్గరికి వచ్చి, తన కత్తితో అతన్ని కొట్టింది. ఆ కత్తి తొమ్మిది అడుగుల బారు ఉంది. మంచి పోత ఉక్కుతో తయారుచేసిన కత్తి. కాని అలాంటి కత్తి కూడా ముక్కలు ముక్కలై పోయింది. అతను మాత్రం చెక్కు చెదరకుండా అలానే ఉన్నాడు.

"కాచుకో! నేను వస్తున్నా," అన్నాడు అతను.

కొరడా ఎత్తి ఎంత దెబ్బ కొట్టాడంటే మహాకాళం తృటిలో ఎక్కడున్నది అక్కడే చచ్చి పడిపోయింది.

ప్రాసాదం పొగ గొట్టంలోనుంచి పొగ చిమ్మింది. దాన్ని చూడగానే అతని దళాలకి పరమానందం కలిగింది. భజంత్రీలు వాయించడం మొదలుపెట్టారు. పాటగాళ్లు పాడడం మొదలుపెట్టారు. చక్రవర్తి ఆ గొర్రెల కాపరికి ఎదురు సన్నాహం వచ్చాడు. అతని చెయ్యి పట్టుకుని తన మందిరంలోకి తీసుకువెళ్లాడు. చక్రవర్తి అతనికి కూతురును ఇచ్చి పెళ్లి చేసి, ఆ పడుచు జంట కోసం వేరే ప్రాసాదం కట్టించి ఇచ్చాడు. ఆ పడుచు జంట అక్కడ హాయిగా కాపురం చేసింది.

కాని ఇరుగుపొరుగు రాజ్యాల చక్రవర్తులకి ఇది చూసి కడుపు మండింది. ఒక సాదా గొర్రెల కాపరి ఒక చక్రవర్తి కూతురుని పెళ్లాడటమా! అలా చెయ్యడం తప్పేనని ఈ చక్రవర్తి లెంపలు వేసుకుని తన రాజ్యం నలుమూలలకీ వర్తమానం పంపాడు. తన రాజ్యంలో ఎవరు బలవంతులనుకుంటారో వాళ్లు గొర్రెల కాపరిని చంపడానికి ముందుకు రావచ్చు. అలాంటి వాళ్లు ఇద్దరు వచ్చారు. వాళ్లని గొర్రెల కాపరితో యుద్ధం చెయ్యడానికి పంపారు.

వాళ్లు ప్రాసాదం దగ్గరికి వెళ్లారు. గొర్రెల కాపరి వాళ్లని చూడ్డానికి ఇవతలికి వచ్చాడు.

"ఏం ఇలా వచ్చారు వీరులు? నాతో యుద్ధం చేస్తారా? సంధి చేసుకుంటారా?" అని అడిగాడు.

"యుద్ధం చేస్తాం," అని వాళ్లు జవాబు చెప్పారు. యుద్ధం మొదలైంది.

మొదటివాడు ముందుకు వచ్చి గొర్రెల కాపరి ఎడమ భుజంమీద కత్తితో కొట్టాడు. కత్తి ముక్కలు ముక్కలై పోయింది. తర్వాత రెండో వాడు వచ్చి కుడి భుజంమీద కొట్టాడు. కత్తి విరగలేదు కాని, అతని చొక్కాని చీరింది.

అప్పుడు గొర్రెల కాపరి వంతు వచ్చింది. అతను నిటారుగా నిలబడి ఆ ఇద్దరినీ పట్టుకుని ఒకళ్లకేసి ఒకళ్లని అదిమి పెట్టి నొక్కేశాడు. ఆ ఇద్దరూ నలిగి చచ్చిపోయారు. వాళ్ల ఎముకలు నేలమీద చెదిరి పడిపోయాయి. గొర్రెల కాపరి కొన్ని ఎముకలని ఏరి చక్రవర్తి దగ్గరికి తీసికెళ్లాడు. గొర్రెల కాపరి ఎంత కోపంగా ఉన్నాడంటే మామూలు మర్యాదలు పాటించకుండా చక్రవర్తితో మాట్లాడాడు.

"ఈ ఎముకలు చూశావా, చక్రవర్తీ! జాగ్రత్త! లేకపోతే నీ అవశేషంగా ఉండేవి ఇవే," అన్నాడు.

ఆ దెబ్బకి చక్రవర్తి ఎంతో భయపడి పారిపోయాడు. ఆ క్షణంనుంచీ గొర్రెల కాపరి ఆ రాజ్య పాలకుడు అయ్యాడు.



ISBN 978-93-80153-57-5

9 789380 153575

మంచి పుస్తకం